# తీర్పు

శ్రీ బలిజేపల్లి రాఘవరావు

ఆ రోజుల్లో జహంగీరు వైభవోపేతంగా పరిపాలన సాగిస్తున్నాడు. జహంగీరు భోగలాలసుడై పరిపాలనా భారమంతా భార్య అయిన నూర్జహాన్ చేతిలో వుంచేడు. అందుచేత నూర్జహాన్ ఆజ్ఞ సుగ్రీవాజ్ఞగా చెల్లుబడి అవుతూండేది. సాధారణంగా మొగలు స్త్రీలు అంతకుముందు సభకురావడంగాని, ప్రజల కంటబడడంగాని అరుదుగా వుండేది. కాని నూర్జహాన్ ఘోషా విధానానికి స్వస్తిచెప్పి బాహాటంగా ప్రతివారికీ దర్శనమిస్తూ వుండేది.

అప్పటికప్పుడే వేసవి ప్రారంభమైంది. 'ఆగ్రా'లో యెండవేడిమి తీవ్రంగావుంది. రాజమహల్ చుట్టూ వున్న మామిడిచెట్లమీదినుంచి కోయిల హృదయరంజకంగా కూస్తున్నాది. చలువరాతితో కట్టబడిన మహల్‌లో పన్నీటి జల్లుతో తడిసిన వట్టివేళ్ల పంకాక్రింది - ముఖమల్ సోఫాలో ఆసీనులైన రాజకుటుంబం ప్రచండమైన సూర్యతాపాన్ని లవలేశమైనా ఖాతరు చెయ్యలేదు. ప్రభువుల మనోభావాల్ని గుర్తెరిగి, వారి ఆజ్ఞలను రెప్పపాటులో అమలులో పెట్టించడంకోసం వృద్ధకంచుకి తెరవెనుక ద్వారం దగ్గర యెప్పుడూ ఆసీనుడై వుంటాడు. దర్బారులోకూడా రాణీగారి సింహాసనానికి అనతి దూరంలోవుండి ఆజ్ఞకోసం యెదురుచూస్తూ వుంటాడు.

ఆ నాటి సభకు వృద్ధుడురాలేదు. అతనిస్థానే ఒక యువకుడు నియమించబడ్డాడు. అతనికి దర్బారులో ప్రవేశం కలగడం యిదే ప్రథమం. దేవేంద్ర వైభవంతో తులతూగుతూన్న ఆ మహల్ ఆ బంగారు సింహాసనం చూసేటప్పటికల్లా అతనికళ్లు జిగేల్మన్నాయి. అతడు తను చూసిన దానిని తనే నమ్మలేకపోతున్నాడు. ఇంతవరకూ వింధ్యప్రాంతాల్లో వుండే దుర్గంలో మొక్కలకు నీళ్లుపోసుకుంటూ వొదుగుకుంటూన్న వ్యక్తి యీ దర్బారుని చూసి బ్రహ్మాండమైన ఆశ్చర్యాన్ని పొందేడు. అతనికి యెవరు ఉద్యోగులో, యెవరు తాబేదార్లో తెలిసికోడంకూడా కష్టమైపోయింది. తానెందుకక్కడ నియమింపబడ్డాడు? తను చెయ్యవలసిన పనేమిటి? ఎవరిఆజ్ఞ శిరసావహించడం? ఈ ప్రశ్నలన్నీ అతన్ని కంగారు పెట్టేయి. ముఖ్యంగా రాణీగారు సభకు వచ్చి ప్రజలకి దర్శనమియ్యడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

తను చెయ్యవలసిన పనేమిటో యువకుడికి తెలియలేదు. అతను రెప్పవెయ్యకుండా నూర్జహాన్ వేపే చూస్తూవుండేవాడు. నూర్జహాన్ ఈ సంగతి కనిపెట్టింది. రాణీగారి తీక్ష్ణ దృష్టులు యువకునిమీద ప్రసరించేయి. ఒక నీచ సేవకుడు మహారాణి అయిన తనవేపు కన్నెత్తి రెప్పవాల్చకుండా చూడడమా? అంతవరకూ రాజులకు సహజమైన గాంభీర్యంతోనూ, మందహాసంతోను తొణికిసలాడుతూన్న ఆమె తీవ్రమైన ముఖం కొద్దిగా కెంపుబారింది. వెంటనే ఆమె "ఎవరీ సేవకుడు? వీనిని యెవరిక్కడ నియమించేరు? వీడితల వెంటనే తీయండి" అని ఆజ్ఞాపించింది. సభ్యులంతా ఆశ్చర్యంతో, భయంతో వణికిపోయేరు.

ప్రక్కగదిలోనే సగం మత్తులో మధురమైన మధువును పానంచేస్తూన్న జహంగీరుకి మత్తు పూర్తిగా వదిలింది. అతనికి సభలో యెందుకీ కలకం బయలుదేరిందో తెలియలేదు. ప్రక్కనున్న అంగరక్షకుడు సంగతంతా విశదీకరించేడు. జహంగీరు వెంటనే నూర్జహాన్‌ని సమీపించి "ఎవరీ సేవకుడు? వీనికెందుకు మరణశిక్ష విధించేవు" అని ప్రశ్నించేడు. ఆమె యింకా నిప్పులు కక్కుతూనేవుంది. "ఎవరో బుద్ధిలేని తులువ. వీడినికాదు శిక్షించటం. ఇటువంటివాడ్ని కాపలాకి నియమించిన ఆ ఖిల్లేదారు తల తీయించాలి" అన్నది. జహంగీరు వెంటనే అది

సమయంకాదని పూరుకున్నాడు. కాని ఒక్క క్షణం గడిచిన వెంటనే జహంగీరు సింహాసనంనుంచిలేచి "ఈ విషయం రేపు విచారించి న్యాయాన్ని నిర్ణయిస్తాం. అంతవరకూ సేవకుడ్ని ఖైదులో వుంచండి" అనిచెప్పి సభ విడిచి బయటికి వెళ్ళేడు. ఆ నాటి సభ ఈ సంఘటనతో ముగిసింది.

అప్పటికి మధ్యాహ్నం పన్నెండు గంటలై వుంటుంది. జహంగీరు నూర్జహాన్ భోజనాది కృత్యాలు తీర్చుకొన్నారు. జహంగీరు నూర్జహాన్ అందిస్తూన్న తాంబూలపు చిలకలు నములుతూ పచ్చలతో పొదగబడిన హుక్కా పీలుస్తున్నాడు. ఇలా కొంత సేపు జరిగింది. తరువాత జహంగీరు "బేగమ్! ఆ సేవకుడికెందుకు అంత కఠినశిక్ష విధించేవు? అతడు చేసినది అంత పెద్ద నేరమా?" అన్నాడు.

"నేరమా అని మెల్లగా అంటూరేం! ఆ నీచుడి తాహతెంత? వాడు మహారాణినైన నావంక కన్నెత్తి రెప్పవాల్చకుండా చూడ్డమే?"

"బేగమ్! వాడి చూపుల్లో యే భావంవుందో నువ్వు కనిపెట్టేవా?"

"అది నాకు అనవసరం"

"ఐనా విను వాడి చరిత్ర నంతటినీ ఖిల్లేదారువల్ల నేను అప్పుడే తెలుసుకున్నాను. వాడెవడోకాదు. మనవృద్ధకంచుకిని తెలుసుగదా! వాడికొడుకు. ఈ వృద్ధుడు కూడా కొంతకాలం క్రిందట యమున వొడ్డున నున్న మన వుద్యానవనంలో మాలిగా వుండేవాడు. తరువాత మనం విహారానికి వెళ్లి వాడిని అంతరంగిక సేవకుడిగా నియమించేం. ఈ యువకుడు వాడి కుమారుడేనని చెప్పేనుగదా! వీడు వింధ్య ప్రాంతంలో వుండే కొండదుర్గంలోని ఠాణాలో సేవకుడు. తండ్రిని చూసిపోదామని వచ్చేడు. ఈ దినం మనవృద్ధ సేవకుడి శరీరంలో కులాసాగా లేనందువల్ల కుమారుడ్ని తనస్థానంలో నియమించవలసిందిగా ఖిల్లేదారుని కోరేడు. ఆయన అలాగే చూసేడు. వింధ్యాటవులలో వుండేసేవకుడికి ఇక్కడి ఆచారాలూ, యీరాజభవనం చూసే సరికల్లా ఒకవిధమైన భయం, ఆశ్చర్యం కలిగేయి. ముఖ్యంగా నువ్వు సభకిరావడం, బాహాటంగా అందరికీ దర్శన మివ్వడం అతనికి ఆశ్చర్యానికలిగించింది. ఇంతకుముందు మొగలు స్త్రీలందరూ ఘోషాలో నుండేవారు. నీ వావిధానానికి స్వస్తి చెప్పి నలుగురికీ కనిపించడమే వాని ఆశ్చర్యానికి కారణం. అందుచేతనే వాడు నీ వైపు రెప్పవాల్చకుండా చూసేడు. కాని మరోవుద్దేశం వాడి మనస్సులో లేదని నేను చెప్పగలను." అన్నాడు.

ఈమాటలు విన్న నూర్జహాన్‌కి నోటమాట రాలేదు. కాని ఆమెనిరంకుశాధికారం వమ్ము కావడం ఆమెకి యెంతమాత్రం యిష్టంలేదు. అందుచేత తల పంకించి, "నా ఆజ్ఞకియెదురులేదు. అన్నమాట నిలబెట్టుకోడం ప్రభుధర్మం. లేకపోతే రాజ్య నిర్వహణం దుస్సాధ్యం" అంది.

జహంగీరు "నీవు చెప్పిన మాట అక్షరాలానిజం అన్నమాట ప్రకారం అక్షరాలా జరిపించడం ప్రభు ధర్మమే. కాని యీ రాజ్యానికి ప్రభువెవరో నీకు మాత్రం తెలియదా? ఎంత భోగలాలసుడినైనా ఖురాన్ ప్రకారం, మనరాజ్యాంగ పద్ధతిప్రకారం న్యాయ విచారణచేసి శిక్షించే అధికారంనాకేకదూ దఖలుపడింది."

గంభీరమైన యీ ప్రసంగం నూర్జహాన్‌లో బ్రహ్మాండమైన పరిణామాన్ని కలిగించింది. ఆమె హృదయం జహంగీరు యెడల భక్తి ప్రపత్తులతో నిండిపోయింది. ఆమె నమ్రంగా "అలాగే ప్రభూ! మీరుచెప్పిన విధంగానే చేస్తాను." అంది.

"ఇలా అన్నానని నన్ను అపార్థంచేసుకోకు. నేనెంత తెలివైనవాడినైనా సౌందర్యంలో నిన్ను మించలేనుగా!" అన్నాడు. జహంగీరు. మహారాణీ తల వాల్చింది సిగ్గుతో.

మరునాడు సభలో జహంగీరు విచారణ ప్రారంభించేడు. విచారణముగిసింది. పిమ్మట అతడు సభనంతా కలయజూసి యిలా చెప్పేడు. "ఇందులో యువకసేవకుడి తప్పేమీ లేదు. అతడు అమాయకుడు. కాని యితనికి దర్బారు సాంప్రదాయాలు తెలియవుగనుక నేటినుండి రాజమహలు ప్రవేశించడానికి వీల్లేదు. అతని జీవితమంతా వింధ్యాటవుల్లోని కొండదుర్గంలో సేవకుడిగా గడపాలి." సభ్యులంతా ఆశ్చర్యంతో ఒకరి నొకరు చూసుకున్నారు. అంతా ఒక్క సారిగా "న్యాయసింహా! జహంగీరు చక్రవర్తికి జై!" అని నినాదాలు చేసేరు.

యువకసేవకుడి కళ్ల వెంట రెండు కన్నీటి బిందువులు జలజలరాలేయి!

పాత్రుడుగారి

# బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

## డాక్టరు పిళ్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.




# జండు గ్రైపెనాల్

ఇది పసిబిడ్డల జీర్ణకోశ వ్యాధులన్నిటియందు మంచి గుణము యివ్వగలదు. వారికిగలుగు అజీర్ణము, ఉన్మాదము, శూల, పురిత్రేపులు, జ్వరము, విరేచనములు మొదలగువాటిని రూపుమాపి సుఖము నిచ్చును. ఆంధ్ర దేశములోను అన్ని మందుల షాపులలో దొరుకును.

సోల్ ఏజంట్లు: దామోదర్ & కంపెని, మద్రాసు & విజయవాడ

ధర బుడ్డి 1 కి రు. 0-14-0